"నేను చెప్పిన చిటకా ప్రకారము, చేస్తానన్నాడు. చలికుదుపు యెక్కువ అయినప్పుడు, నీభార్యను దగ్గరికి పిలిచి, గట్టిగా కౌగలించుకుంటే, కుదుపు తగ్గుతుందని ఆ వైద్యుడు చెప్పాడూ, నేను అలాగే చేశానూ, నాకు నిజంగానే తగ్గింది అని చెప్పాను; అప్పుడు ఆ ఛండాలపు వెధవ ఏమన్నాడో తెలుసా?' అని అడిగాడు వెంకటరావు.

'నాకు తెలియదు. ఏమన్నాడేమిటి' అన్నాను.

"ఏమన్నాడా? నీభార్య యిప్పుడు ఇంట్లో వుంటుందా అని అడిగాడు, దొంగగాడిదకొడుకు: అలాటివాణ్ణి నిలువునా చీల్చిపారవెయ్యవద్దూ" అంటూ నా మొహంచూశాడు.

నవ్వితే వెంకటరావుకి కోపమువస్తుంది. నవ్వకపోతే ప్రాణం వుక్కిరిబిక్కిరి అయేటట్టుంది. ఏం చెయ్యడానికీతోచక దగ్గుతెచ్చుకొని పేగులు వుండచుట్టుకునే దాకా దగ్గి, చచ్చిచెడి చేయంగల విన్నపములై యింటికి చేరాను.

# లేడీ డాక్టరు

'నువ్వు కొత్తగా ట్రెయినింగు అయివచ్చావా' అని ఎదుట నిలుచున్న నర్సును అడిగింది డాక్టరు లీల.

'అవునమ్మా' అని వినయంగా జవాబు చెప్పింది నర్సు.

'నీ పేరు?'

'కృపావతి'

'నిన్ను ఎవరు రికమెండు చేశారు?'

'ఎవరూ రికమెండు చెయ్యలేదు. పెద్ద డాక్టరమ్మగారిని మా నాన్న అడిగాడు. డాక్టరమ్మగారు ఆర్డరువేశారు.'

'అయితే-' అని మాట సంగంలోనే యేదోపని వున్నట్లు వెళ్ళిపోయింది. డాక్టరు లీల. కృపావతి మందు సీసాలు అలమారులో సవరిస్తూ క్రొత్త వుద్యోగంమీద ఉండే శ్రద్ధను కనుపరుస్తోంది.

అది కాన్పుల ఆసుపత్రి. అందుచేత మగ పురుగుకికూడా ఆ ఆసుపత్రి లోకి ప్రవేశంలేదు. ఏదో ఒకవేళ సాయంత్రం నాలుగూ, అయిదూగంటల మధ్యమాత్రం మగవాళ్లని లోపలికి వెళ్లనిస్తారు. గంట అయిందనటంతో అంతా బయటికి వెళ్లిపోవలసిందే. ఇహ తక్కిన కాలంలో ఆ ఆసుపత్రి అంతా ఆడవాళ్లమయంగా ఉంటుంది.

అదృష్టవశాత్తూ యే మగవాడేనా, అలాటప్పుడు ఆ ఆస్పత్రిలోకి వెళ్ళకలిగితే ఆ నర్సులు ఒకళ్ల నొకళ్లు చేసుకొనే పరిహాసాలూ, అది చూసి డాక్టర్లు అనుభవించే ఆనందాలూ, చూసి పరవశుడౌతాడు.

కాని ఎంత సంతోషంగా వాళ్లు ఉన్నా, సాయంత్రము నాలుగూ అయిదూ గంటల మధ్య మగవాళ్లువచ్చేటప్పుడు ఆ నర్సుల మొహాలమీద తాండవించే మధురమైన కళ, కేవలమూ వాళ్లే ఉన్నప్పుడు మాత్రం కనపడదు. స్త్రీ పురుషులలో అన్యోన్యాకర్షణ స్వాభావికమనీ, ఏజాతికానీ కేవలం వాళ్లుగానే వుంటే ప్రకృతి తత్త్వానికే లోటు అనీ, ఈ విషయాన్ని శ్రద్ధతో గమనించే ప్రతివాడికీ బోధపడుతుంది.

ప్రౌఢలైన డాక్టర్లు మగవాళ్ల విషయంలో కొంచెం నిర్లక్ష్యంగా వున్నట్టు నటించినా, కిలకిలలాడుతూ, మల్లెపువ్వులలాంటి తెల్ల చీరలు కట్టుకొని తిరుగుతూవుండే నర్సులుమాత్రం కనపడ్డ ప్రతి మగవాడినీ యెగాదిగాచూసి, కొంచెం సిగ్గును కనపరుస్తూ వుంటారు.

తన ప్రక్క చేతులు నలుపుకుంటూ నడుస్తూవున్న ఒక పల్లెటూరి బ్రాహ్మణ్ణి, భార్యని ఆలస్యంగా కాన్పుకి తీసుకొచ్చినందుకు తెలుగులో మండలిస్తూ, ఇంగ్లీషులో తిడుతూ గబగబా అడుగులువేస్తూ కారిడరులో నుంచి వెడుతూన్న డాక్టరు లీలను కృపావతి ఓరకంటితో చూసింది. కృపావతిని లీలకూడా ఓరకంటితో చూసి చిరునవ్వు నవ్వింది. లీల చామనచాయ మనిషి. అంత సౌందర్యరాశి కాకపోయినా, దిద్దుబాటువల్ల నాజూకుగా వుంటుంది. కృపావతి అలాకాదు. బహు అందంగా వుంటుంది. కాని మగవాడెవర్నేనా, 'కృపావతికావాలా, లీలకావాలా' అంటే మాత్రం

ఇద్దరూ కావాలని టక్కున చెప్పేస్తాడు. అంచేత ఇద్దరిలోనూ అందము వుందని ఒప్పుకోవాలి.

లీల అలా వెళ్ళిన వెంటనే, కృపావతి మందులు సర్దడము అయిపోయి నందున, చేతులు కడుక్కుందుకు ప్రక్కగదిలో కొళాయిదగ్గిరికి వెళ్ళింది. అప్పుడే చేతులు కడుక్కొని, అద్దానికి ఎదురుగుండా నిలుచుని తువ్వాలుతో చేతులు తుడుచుకొంటూన్న లీల కృపావతిని చూడగానే తువ్వాలును కొంకెకి తగిల్చి 'ఏం వచ్చావూ' అంటూ కృపావతి వీపుమీద చెయ్యి వేసింది. జంకుతూ కృపావతి రెండడుగులు వెనక్కి వేసింది.

'మీ నాయనకు ఏంపని?' అంటూ లీల తన కుడిచేత్తో కృపావతి భుజం ఊపుతూ అడిగింది. 'కైలు గేటుకి మేస్త్రీపని చేశాడు. ఇప్పుడు మానేశాడు. మా అన్న చేస్తున్నాడు ఆపని—'అంటూ కృపావతి యింకా కొంచెం వెనక్కి తగ్గింది.

'ఓహో. నీకు ఎన్నిగంటలదాకా ఉంది డ్యూటీ?' అంది లీల, చెయ్యి మాత్రం కృపావతి భుజంమీదేవుంది.

'రాత్రి ఎనిమిది గంటలతో అయిపోతుంది' అంది కృపావతి.

'నాకు అప్పటితో పే సరి' అని లీల యింకా ఏదో చెప్పబోయింది. ఇంతలో, ప్రక్కవార్డులో హెడ్‌నర్సు వచ్చి 'డాక్టరమ్మా; నిన్నరాత్రి ఎడ్మిట్ ఐన ఆ మెకి లేబరు ఆరంభమయింది' అని చెప్పింది. 'పద, వస్తున్నా' అంటూ ఇంకోసారి కృపావతి వీపు నిమిరి వెళ్లిపోయింది.

కొంచెంసేపటిదాకా కృపావతికి యిదివొక వింతగా తోచింది. డాక్టరు లీల తన భుజంమీద చెయ్యివేసి తనతో మాట్లాడుతూ వున్నంతసేపూ కృపావతి వొళ్లు జలదరించింది. డాక్టరు లీల కళ్లు, మధురమైన, సౌమ్యమైన స్త్రీత్వాన్ని కాకుండా, తీవ్రమైన, గంభీరమైన పురుషత్వాన్ని తొణికిస్తూ వున్నట్టు కృపావతికి తోచింది. లీల కళ్లల్లోంచి తన వేపు ఎవరో పురుషుడు చూస్తున్నాడు, అని అనుకునేటప్పటికి సిగ్గుకన్న భయం ఎక్కువవేసింది. తప్పించుకుంటూ ఆ విషయమే ఆలోచించుకుంటూ, కృపావతి తన

డ్యూటీ తను చేసుకోవడానికి ఆరంభించింది.

రాత్రి ఎనిమిదిగంటలయింది. తనను రిలీవు చెయ్యడానికి వచ్చిన ఇంకో నర్సుకి వార్డుబుక్కూ, ప్రిస్క్రిప్షను బుక్కూయిచ్చి కృపావతి, ఆ హాస్పిటలు కాంపౌండులోనే వున్న వాళ్ల హాస్టలుకి వెళ్లడానికి బయలుదేరింది. రెండు కారిడరులు మళ్లి, డాక్టర్ల ఆఫీసుదగ్గరికి వచ్చింది.

డిమ్ముగా వెలుగుతూవున్న ఎలక్ట్రిక్ లైట్ల వెలుతురులో, కృపావతి మెల్లిగా వెడుతోంది. ఆమె భుజంమీద మళ్లా చెయ్యిపడింది. ఉలిక్కిపడి కృపావతి వెనక్కి చూసింది. ఠీవిగా మొగరాయుడు నవ్వుతో లీల కృపావతిని దగ్గరగా లాగింది. ఏం చెప్పడానికి కృపావతికి యేమీ తోచలేదు. ఆమెకి యీ విషయమే బోధపడలేదు. ఎందుకు తన్ను చూస్తే లీలకి అంత ప్రేమ, అసలు ఇది ఎలాటి ప్రేమ, ఇవియేవీ ఆలోచించుకో తగినంత చిత్త సంస్కారముకూడా ఆమెకిలేదు. కాని, తనని యిలా భుజాలు పట్టుకుని దగ్గరకు లాక్కునే అంత ప్రేమ లీలకు ఎలాకలిగిందీ! లీలనవ్వూ, నడకా అంతా మొగతనాన్ని తోపింపజేస్తున్నాయి. ఆమాట తలుచుకునే టప్పటికల్లా కృపావతిని ఏదో భయం ఆవహించింది.

'హాస్టలుక వెళుతున్నావా ఏమిటి కృపావతీ' అంటూ కృపావతి మెడమీదుగా తన కుడిచేతిని కృపావతి కుడిభుజంమీదవేసి, భుజం గట్టిగా నొక్కింది లీల.

'అవునమ్మా' అని కృపావతి బదులుచెప్పింది. కాని గొంతుకకు యేదో అడ్డింది. లీల తన చెయ్యిని కృపావతి భుజంమీదినుంచి బుగ్గల దగ్గిరికి తీసుకు వెళ్లింది.

'అన్నం యీపాటికి చల్లారిపోయివుండదూ?' అంది లీల.

'అవును. ఒక బంతి తినేసివుంటారుకూడాను' అని తడుముకుంటూ జవాబు చెప్పింది కృపావతి.

'అయితే......' అని ఆగింది. డాక్టరు. బెదురుతూవున్న కళ్లతో డాక్టరు మొహంకేసి చూసింది కృపావతి. మెల్లిగా అడుగులు వేస్తూ

నడుస్తూ వీళ్లు యీపాటికి సరిగ్గా ఎలక్ట్రిక్ లైటు ముందరికి వచ్చారు. చిరునవ్వు మొగచిన్నెలతో తళతళ మెరుస్తున్నాయి లీల కళ్లు. కృపావతికి సిగ్గూ జంకూ మిళితమై వొళ్లంతా వొణికింది. గుండెలు బరువుగా అనిపించాయి. '......నాతోటి భోంచేదువుగానిరా, ఈపూట నాకు తోడు కూడాయెవరూ లేరు,' అందిలీల.

కృపావతికి యేమీ తోచలేదు. రాను అని చెప్పడానికి డాక్టరు ఏమి అనుకొనిపోతుందో అని భయం. పోనీ వెడదామా అంటే—కారణం తెలియని ఇంకో భయం-డాక్టరు ఈ చర్యలన్నిటిమీదా సంకోచమూ, కాని ఏమీ చెప్పలేకపోయింది. సాయంత్రం నాలుగుగంటలకి తన్ను చూసిన డాక్టరుకి, ఎనిమిదిగంటలయేటప్పటికి తనమీద ఇంత ప్రత్యేకశ్రద్ధ ఎందుకూ? కృపావతికి బోధపడలేదు. కాని, తనకి తెలియకుండానే, డాక్టరుతోపాటు అడుగులువేసి నడుస్తూవుంది.

కొంచెందూరం వచ్చాక, 'మీ హాస్టలు సూపరింటెండెంటుతో చెప్తాద్దూ-నేను చెప్పవస్తాను వుండు' అంటూ డాక్టరు లీల వాళ్లు వున్నచోటికి యిరవైగజాల దూరంలో వున్న హాస్టలులోకి గబగబా వెళ్లి, అయిదు నిముషాలలో సాలీడువలలో పడి కొట్టుకొనే యీగలాగ కొట్టుకుంటూవున్న కృపావతిదగ్గరకువచ్చి 'ఇహ, రా' అని ఆమె యెడమచెయ్యి పట్టుకొని లాక్కొని వెళ్లింది, అక్కడికి నలభై, యాభై గజాల దూరంలోవున్న తన యింటికి—చక్కని పేము కుర్చీలు, క్యాంపు కాటూ, అందమైన డ్రాయరూ, యీజీ చేరు, గోడమీద ఫ్రేంచిఫోటోలు, గోడకి నిలువుటద్దము, ఆ హాలు అమరిక చెప్పడానికి వీలులేదు. కృపావతి అలాంటి హాలు చూసి యెరుగదు. ఎంత హాయిగా బ్రతుకుతోందీ డాక్టరు లీల! అనుకుంది.

'కూర్చో యిలాగ' అంటూ కృపావతిని, పేముకుర్చీలో కూచోపెట్టింది లీల. అర్థంకాని ఆలోచనలతో గది అన్నివేపులకీ బెదురుతూ చూస్తూ కృపావతి కూచుంది. డాక్టరు, ప్రక్కగదిలోకివెళ్లి హాస్పిటలులోకి వెళ్లేటప్పుడు తాను కట్టుకున్నచీర విప్పేసి, తెల్లటి పలచటి చీరా, ఊదారంగు

జంపరూ తొడుక్కొని యివతలికివచ్చి వరండాలో పెట్టివున్న టిఫిను క్యారియరును తీసుకొచ్చి బల్లమీద పెట్టి 'ఏం కృపావతీ, భోంచేద్దామా' అని అడిగింది. కృపావతి తలమాత్రం ఊపింది.

గిన్నెలన్నీ వరసగా టేబిలుమీద పరిచి, గాజుగ్లాసులతో మంచినీళ్లు పెట్టి హోటలువాళ్లు పంపిన అరటి ఆకును రెండుపాయలుగా చీల్చి యిద్దరికీ వడ్డించి, 'లే, రా, కూచో' అంది లీల.

బయటిహాలులోకి వెళ్లి బకెటులోవున్న నీళ్ళతో కాళ్లూ చేతులూ కడుక్కొని భోజనానికి బల్లదగ్గర కూచుంది కృపావతి. లీల కృపావతి కేసి చూసి చిరునవ్వు నవ్వి 'ఊఁ, కానీ' అంటూ, తనూ ఆరంభించింది.

భోజనము ప్రశాంతంగా పూర్తి అయింది. గబగబా గిన్నెలు సర్ది వేసి, తమలపాకులూ వక్కలూ తీసుకొచ్చింది లీల. మాట్లాడకుండా తమలపాకులు వేసుకోవడం ఆరంభించింది కృపావతి.

తమలపాకులు నములుతూ, వాళ్లిద్దరూ, ఆస్పత్రి గొడవలు చాలాసేపు మాట్లాడుకున్నారు. రాత్రి పదకొండు గంటలయింది.

'ఇంక పడుకుందాములే' అంటూ డాక్టరు లీల లేచింది

కృపావతికూడా లేచి గది నాలుగుమూలా చూసింది. ఒక్కటే క్యాంపు కాట్ కనపడుతోంది. అంచేత 'డాక్టరమ్మా! నాకొకచాపా, దిండూ యివ్వండి చాలును' అంది.

కృపావతి కేసి చూసింది లీల. లీలచూపులో మొగతనము మూర్తీభవించింది. చిరునవ్వు నవ్వుతూన్న ఆమె పెదవులు మొగతనపుచలనాన్ని సూచించాయి. కృపావతి వొళ్లంతా కంపరము పుట్టింది.

'చాప యెందుకూ, ఆ మంచముమీద పడుకో' అంది లీల.

'మీరు?' అని అడిగింది కృపావతి.

'నేనూను. ఇద్దరం పడుకోకూడదూ ?'

ఝల్లుమంది కృపావతి వొళ్లు.

'ఆ మంచంమీదా ?' అని అడిగింది.

‘ఏం! ఆ మంచంమీదే. వొంటికి వొళ్లు తగలకూడదా ఏమిటి?’

కృపావతికి ముచ్చెమటలు పట్టినాయి. ‘రా, సిగ్గేమిటి? ఇద్దరమూ ఆడాళ్లమేకదూ’ అంటూ కృపావతిని నడుముమీద చెయ్యివేసి తీసికెళ్ళి క్యాంపు కాటుమీద పడుకోబెట్టింది డాక్టరు లీల.

కృపావతి గుండెలు దడదడ కొట్టుకొన్నాయి. ఆమె శరీరమంతా భయంతో ముద్దయిపోయింది.

‘భయమేమిటీ’ అంటూ తనుకూడా ఆ మంచంమీదే పడుకుంటూ కృపావతిని దగ్గరగా లాక్కుని రొమ్ముకి అదుముకుంది లీల.

# ధర్మసందేహం

నలుగురమూ కూచుని కబుర్లు చెప్పుకుంటున్నాము. ఆమాటా, ఈమాటా నుంచి మా సంభాషణ శృంగారంమీదికి వెళ్ళింది. ప్రతివాడూ తన అనుభవాలనూ, తాను విన్న యితరుల అనుభవాలనూ చెప్పడం ఆరంభించాడు.

ఉన్నట్టుగావుండి శేషయ్య “నాకొక అనుభవం జరిగింది. చెపుతాను వినండి” అన్నాడు, తక్కిన ముగ్గురమూ మేం చెప్పదలచుకున్న వాటిని మానేసి, శేషయ్యను చెప్పమన్నాము.

సాధారణంగా మా నలుగురిలోనూ శేషయ్య చాలా తక్కువగా మాట్లాడుతూ వుంటాడు. అతను ఏ సంగతి చెప్పినా చాలా అద్భుతంగా వుంటుంది. అతను చెప్పిన విషయాన్ని విని మేము ఎంతోసేపు ఆశ్చర్యంతో అలాగే వుండిపోయేవారము.

మేము ఏదైనా చెపితే, అసలు జరిగిన దాంట్లోనుంచి కొంత విడిచెయ్యడమే మామూలు. శేషయ్య అలాకాదు. జరిగింది జరిగినట్లుగా, చక్కగా చెప్పేవాడు. ఎప్పటికప్పుడు కొత్తకథలు చెపుతూ వుండేవాడు. అంచేత యీసారి ఏం చెపుతాడో అని మా అందరికీ కుతూహలం కలిగింది.

అతను ఇలా చెప్పాడు. “అప్పుడు నాకు ఇరవయ్యోయేడు. ఇప్పుడు నేను